క్లుప్తంగా

5న వాహనాల వేలం

గరుగుబిల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మండల పరిధిలోని పలుచోట్ల వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 5వ తేదీన వేలం వేయనున్నట్లు ఎస్‌ఐ ఎం.రాజేష్ ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు ఉదయం 9 గంటలకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి, వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



గరుగుబిల్లిలో రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ గోపాలరావు

గరుగుబిల్లి: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్లు ఈఓపీఆర్‌డీ ఎల్.గోపాలరావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పలు రక్షిత మంచినీటి పథకాల్లో చేపట్టిన క్లోరినేషన్ చర్యలను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య చర్యలు మెరుగుపరిచి, ఆరోగ్యవంతమైన సమాజానికి కృషి చేస్తున్నామన్నారు.

రక్షిత మంచినీటి పథకాల పరిశీలన



తాగునీటి కుళాయిలను పరిశీలిస్తున్న డీఈఈ నాగేశ్వరరావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కుక్కిడి, శిఖలపాయి, నిగరాం, పాతనిగరాం, స్తంభంగూడ గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాలను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ కె.నాగేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తాగునీటి పథకాల నిర్వహణ, క్లోరినేషన్ చర్యలపై సంబంధిత సిబ్బందిని ఆరాతీశారు. ఎక్కడైనా తాగునీటి సరఫరా పైపులు పాడైతే వాటి మరమ్మతులు వెంటనే చేయాలన్నారు. ఆయన వెంట ఏఈ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు



సాలికిరి గ్రామ వీధి కాలువల్లో పూడికలు తొలగిస్తున్న కూలీలు

భామిని: మండలంలోని సాలికిరి, బాలేరు గ్రామాల్లో చురుగ్గా పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం ఆయా గ్రామాల్లోని వీధుల్లో ఉన్న చెత్తాచెదారం ఏరివేయడంతో పాటు కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలగించారు. సర్పంచ్ జామి ప్రభాకర్, ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్ ఈ పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్నారు.

చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలి



సచివాలయ రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రామచంద్రరావు

భామిని: చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేయాలని పాలకొండ డీఎల్‌పీఓ జె.రామచంద్రరావు సూచించారు. మండలంలోని బత్తిలి గ్రామ సచివాలయాన్ని గురువారం సందర్శించిన ఆయన అక్కడి రికార్డులు తనిఖీ చేసి, కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. సమస్యల పరిష్కారానికి సచివాలయానికి వచ్చే ప్రజా ప్రతినిధులు, ప్రజలను గౌరవించాలన్నారు. అందరూ ఎఫ్‌ఆర్‌ఎస్(ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్)లో హాజరు వేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపడాలి



మాట్లాడుతున్న ఎంఈఓ కృష్ణమూర్తి

వీరఘట్టం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మరింత మెరుగుపడాలని ఎంఈఓ పత్రి కృష్ణమూర్తి సూచించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులతో గురువారం సమావేశమైన ఆయన విద్యాభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అవి సక్రమంగా విద్యార్థులకు అందుతున్నాయా లేదా అనే విషయాలపై చర్చించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వండిపెట్టాలని తెలిపారు.

వలసల నివారణకే 'ఉపాధి' పనులు

- నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేయాలి
- వేతనదారుల సంఖ్యను పెంచాలి
- ఉపాధి పనుల పరిశీలనలో ఎంపీడీఓలు



కొమరాడ: లక్ష్మీపేట గ్రామంలో వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ అప్పారావు



భామిని: వేతనదారులకు సూచనలిస్తున్న టీఏ గంగాధర్



ఉపాధి పనుల పరిశీలనలో ఎంపీడీఓ సాల్మన్‌రాజు

పాలకొండ రూరల్: గ్రామీణ ప్రాంతాల నుంచి వలసల నివారణకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పనులు నిర్వహిస్తున్నాయని ఎంపీడీఓ డొంక త్రినాధులు అన్నారు. గురువారం మండలంలోని బెజ్జి, దుగ్గి, వాటపాగు, కొండాపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డులో ఉన్న వారినే పనులకు అనుమతించాలని, పనిలోకి వచ్చిన వారికే మస్తరు వేయాలని సూచించారు. రెండు పూటలా కొలతల ప్రకారం పని చేయాలన్నారు. అనంతరం అక్కడి సచివాలయాలను ఆయన సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమయానికి విధులకు హాజరై, అర్హులకే సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు.

రెండు పూటలా పని..

కొమరాడ: మండలంలోని కంబవలస పంచాయతీలోని లక్ష్మీపేట, కంచరపాడు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ ఎల్.వి.అప్పారావు గురువారం పరిశీలించారు. అనంతరం వేతనదారులతో మాట్లాడిన ఆయన రెండు పూటలా పనిచేయాలని సూచించారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.257 వేతనం లభిస్తుందన్నారు. రానున్న వేసవి నేపథ్యంలో పని ప్రదేశంలో తాగునీరు, టెంటు, ప్రథమ చికిత్సా కిట్ ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ బాలకృష్ణ, టీఏ దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

యాప్‌లో హాజరు నమోదు..

గరుగుబిల్లి: మండలంలోని సుంకి పంచాయతీ పరిధిలో చేపడుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీఓ జి.పైడితల్లి గురువారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వేతనదారుల సంఖ్యను పెంచాలని సిబ్బందికి సూచించారు. వేతనదారుల హాజరును ఎన్.ఎం.ఎం.ఎస్ యాప్‌లో వేయాలని తెలిపారు. వేతనదారులంతా పని ప్రదేశంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. నిర్దేశించిన కొలతల్లో రెండు పూటలా పనిచేస్తే, గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీఓ టి.రామకృష్ణంనాయుడు, ఎఫ్‌ఏ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కె.శివడ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీఓ ఎస్.సాల్మన్ రాజు గురువారం పరిశీలించారు. అనంతరం వేతనదారులకు పలు సూచనలు చేశారు. సమయానికి పనులకు హాజరు కావాలని, రెండు పూటలా నిర్దేశించిన కొలతల్లో పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు.

భామిని: మండలంలోని గురండి తామరచెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సీతంపేట క్లస్టర్ టీఏ పాతపట్నం గంగాధర్ గురువారం పరిశీలించారు. అనంతరం వేతనదారులతో మాట్లాడిన ఆయన రోజుకు రూ.257 వేతనం పొందాలంటే నిర్దేశించిన కొలతల ప్రకారం పనిచేయాలని సూచించారు. గ్రూప్‌లోని ప్రతిఒక్కరూ పనిచేయాలని, పని ప్రదేశంలో ఉన్న వారికే మస్తరు వేయాలన్నారు. పని మొదట్లో ఉండి, చివరిలో లేని వారికి మస్తరు వేయొద్దన్నారు. కార్యక్రమంలో టీఏ పొత్తక రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: సుంకిలో జరుగుతున్న ఉపాధి పనుల్లో వేస్తున్న కొలతలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి



పాలకొండ రూరల్: వాటపాగు సచివాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీఓ త్రినాధులు

పరశురాంపురంలో డ్రోన్ సర్వే



సర్వేకు డ్రోన్‌ను సిద్ధం చేస్తున్న తహసీల్దార్ రాధాకృష్ణ

కొమరాడ: భూముల రీసర్వేలో భాగంగా మండలంలోని పరశురాంపురం గ్రామంలో డ్రోన్ సర్వే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 9 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తయిందని, మరో 4 గ్రామాల్లో సర్వే జరుగుతోందన్నారు. కొన్ని వందల ఏళ్లుగా రైతుల మధ్య నెలకొన్న భూ సమస్యలు పరిష్కారానికే ప్రభుత్వం భూముల రీసర్వే చేపట్టిందని తెలిపారు. వీలైనంత త్వరగా సర్వే పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

వసతిగృహాల నిర్వహణపై తహసీల్దార్ మండిపాటు



అధ్వానంగా ఉన్న విద్యార్థుల బాత్‌రూమ్‌లను పరిశీలిస్తున్న తహసీల్దార్ రమేష్‌కుమార్

కురుపాం: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంతో పాటు పూలే సంక్షేమ ఆశ్రమ పాఠశాలను తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించి, తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత పాఠశాలల పరిసరాలు, స్నానగదులను చూసిన ఆయన అవి శుభ్రంగా లేకపోవడంపై మండిపడ్డారు. ఇలాగేనా మీ ఇళ్లు కూడా ఉంచుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని, మరోసారి ఇదే పరిస్థితి కనిపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయండి



విద్యాసామర్థ్యం పరీక్షకు విద్యార్థిని ప్రశ్నలు అడుగుతున్న ఎంఈఓ నాగభూషణరావు

గరుగుబిల్లి: విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలని ఉపాధ్యాయులకు ఎంఈఓ ఎస్.నాగభూషణరావు సూచించారు. గురువారం మండలంలోని శివ్వాం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించిన ఆయన అక్కడి విద్యార్థులను వివిధ ప్రశ్నలు అడిగి, వారి విద్యాసామర్థ్యాలు పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలని, చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విద్యార్థులను తెలిపారు.

రుచి, శుచితో మధ్యాహ్న భోజనం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: మండలంలోని ఉద్దవోలు గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలను ఎంపీడీఓ జి.పైడితల్లి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మెనూ ప్రకారం వంటకాలు చేయాలని, రుచి, శుచితో కూడిన భోజనం విద్యార్థులకు వడ్డించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులను వివిధ ప్రశ్నలు అడిగి వారి విద్యాసామర్థ్యాలను ఆమె గమనించారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందించాలని సిబ్బందికి సూచించారు.

సకాలంలో రుణాలు చెల్లించేలా చర్యలు



సీఎఫ్‌లకు సూచనలిస్తున్న సీసీ త్రినాథమూర్తి

వీరఘట్టం: మహిళా సంఘాలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సీసీ త్రినాథమూర్తి సూచించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీఎఫ్‌లతో సమావేశమైన ఆయన మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాల డబ్బులతో వారి జీవనోపాధి మెరుగుపడేలా చూడాలన్నారు. స్వయం సహాయక సంఘాల్లో చేరని నిరుపేద కుటుంబాలను సంఘాల్లో చేర్పించాలన్నారు.

సకాలంలో చెల్లిస్తే రాయితీలు..



పీఏసీఎస్ సీఈఓ పైడిరాజు

వీరఘట్టం: స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రుణాలు తీసుకున్న వారంతా రాయితీలు పొందేందుకు ఇదివరకు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని సీఈఓ బూరాడ పైడిరాజు తెలిపారు. గురువారం పట్టణంలోని ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన వీరఘట్టం పీఏసీఎస్‌లో రుణాలు పొందిన వారంతా ఫిబ్రవరి 28వ తేదీలోగా రుణాలు చెల్లించాలని, లేకపోతే 14 శాతంతో రుణాలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులకు 50 సెంట్ల భూమి ఉంటే రూ.1 లక్ష, 76 సెంట్ల భూమి ఉంటే రూ.2 లక్షలు, 1.50 ఎకరాలుంటే రూ.4 లక్షల వరకు రుణాలు పొందవచ్చన్నారు. మరిన్ని స్థానిక కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

ఆస్పత్రికి వెళ్లి, పెన్షన్ అందజేత

సీతంపేట: విశాఖపట్నం జిల్లాలోని తగరపువలస వద్ద ఉన్న అనిల్ నీరుకొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిండంగి గ్రామానికి చెందిన సవర బుగన్న వద్దకు గ్రామవలంటీర్ సవర బాలాజీ గురువారం వెళ్లి, పెన్షన్ అందజేశారు. సదరు వలంటీర్ ఆస్పత్రికి వెళ్లిమరీ లబ్ధిదారునికి పెన్షన్ అందజేయడం తెలుసుకున్న గ్రామస్తులు వలంటీర్ సేవలను మెచ్చుకుంటున్నారు.

43 మద్యంబాటిళ్ల స్వాధీనం

గరుగుబిల్లి: మండలంలోని కొత్తూరు గ్రామ శివారులో అక్రమంగా తరలిస్తున్న 43 మద్యం బాటిళ్లను గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎం.రాజేష్ తెలిపారు. ఇదే ఘటనకు సంబంధించి, ఓ మహిళను అదుపులోకి తీసుకుని, ఆమెను పార్వతీపురం జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

మూగజీవాలు తరలిస్తున్న వాహనం సీజ్

పాలకొండ రూరల్: అక్రమంగా మూగజీవాలను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు గురువారం పట్టుకుని, సీజ్ చేశారు. పార్వతీపురం నుంచి రాజాం వైపు ఆరు గేదెలతో వెళ్తున్న వాహనాన్ని స్థానిక వైఎస్సార్ కూడలి వద్ద ఆపి, కేసు నమోదు చేశారు. అనంతరం ఈ ఘటనకు సంబంధించి, ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ బి.శివప్రసాద్ తెలిపారు.

లక్ష్మీనృసింహ స్వామికి విశేష పూజలు



లక్ష్మీనృసింహ స్వామి పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

సీతానగరం: మండలకేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో గురువారం స్వామిని చామంతి పూలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ ఆలయంలో ప్రతి గురువారం వేకువ జామునుంచే నిర్వహించే పూజా కార్యక్రమానికి మండలంలోని పలుగ్రామాల నుంచి, సాలూరు, మక్కువ, బొబ్బిలి, పార్వతీపురం ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు రావడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆలయానికి అతి చేరువలో ఉన్న సువర్ణముఖినదిలో స్నానాలు చేసి పూజా సామగ్రితో వచ్చి పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లిస్తారని తెలియజేశారు.

పురుగుమందు తాగి విద్యార్థినికి అస్వస్థత

సీతానగరం: మండలంలోని నీలకంఠాపురం గ్రామానికి చెందిన విద్యార్థిని పురుగుమందు తాగి అస్వస్థతకు గురైంది. వివరాలిలా ఉన్నాయి. వెంకటాపురం పంచాయతీ నీలకంఠాపురం గ్రామానికి చెందిన చీకటి మనీష బొబ్బిలిలోని ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతోంది. తనకు చదువంటే ఇష్టం లేదని కాలేజీలో చేరిన నాటి నుంచి అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. చదువుపై ఆసక్తిలేదని ఇంట్లో చెప్పలేక భయంతో పురుగుమందు తాగి ఆత్మాయత్నానికి పాల్పడింది. తమ కుమార్తె ఇంట్లో ఉన్న పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్న గుర్తించిన తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం మహారాజా ఆస్పత్రికి రిఫర్ చేశారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

పాచిపెంట: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను పార్వతీపురం డీఎస్పీ సుభాష్ గురువారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు త్వరితగతిన పరిష్కరించాలని ఎస్సై వెంకటరమణను ఈ సందర్భంగా ఆదేశించారు. అనంతరం ఆంధ్రా-ఒడిశా సరిహద్దు పి.కోనవలస చెక్‌పోస్టును సందర్శించి అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలందుకున్న మహాలక్ష్మి అమ్మవారు

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి గ్రామంలో మహాలక్ష్మి పేరంటాలు అమ్మవారి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త గుజ్జల రాము కుమారుడు నారాయణరావు, జయలక్ష్మి దంపతులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 4వ తేదీ వరకు జరగనున్న ఈ ఉత్సవాల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం సాయంత్రం ప్రదర్శించిన శ్రీకృష్ణార్జునయుద్ధంలోని గయోపాఖ్యానం నాటకం అందరినీ ఆకట్టుకుంది. అలాగే శ్రీభగవతి నృత్య కళామందిర్ పిల్లలు ప్రదర్శించిన జానపద నృత్యాలు అలరించాయి.

ఈ-క్రాప్, ఈకేవైసీ నమోదు తప్పనిసరి



ఈకేవైసీ వివరాలపై ఆరాతీస్తున్న ఏడీ రత్నకుమారి

పాలకొండ రూరల్: ప్రస్తుతం రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలకు సంబంధించి, ఈ-క్రాప్ నమోదు, ఈకేవైసీ చేయించడం తప్పనిసరి అని రైతులకు వ్యవసాయ శాఖ ఏడీ రత్నకుమారి సూచించారు. గురువారం మండలంలోని లుంబూరు గ్రామ రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించిన ఆమె ఇప్పటివరకు చేసిన ఈకేవైసీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈ-క్రాప్, ఈకేవైసీ ప్రయోజనాలను వివరించారు. రబీ పంటలకు పట్టే చీడపీడల నివారణ, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది పర్యటించి, రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు.

సబ్‌కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాన్ని సందర్శిస్తున్న సబ్‌కలెక్టర్ నూరల్ కమర్

పాలకొండ: నగరపంచాయతీ పరిధిలోని గారమ్మ కాలనీలో ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సబ్‌కలెక్టర్ నూరల్ కమర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, ప్రతీ ఒక్కరి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. తాగునీటి సమస్య ఉన్నట్లు గుర్తించిన ఆయన నగరపంచాయతీ సిబ్బందిని పిలిచి, ఆ సమస్యతను తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. అనంతరం గారమ్మ కాలనీ చెరువు గట్టుపై ఉన్న అక్రమ కట్టడాలను చూసిన ఆయన వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు.

భూముల రీసర్వేను వేగవంతం చేయాలి



సర్వేయర్లతో సమావేశమైన సబ్‌కలెక్టర్ నూరల్ కమర్

వీరఘట్టం: భూముల రీసర్వేను వేగవంతం చేయాలని పాలకొండ సబ్‌కలెక్టర్ నూరల్ కమర్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని 12 గ్రామాల్లో జరుగుతున్న భూముల రీసర్వేపై గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సర్వే జరుగుతున్న తీరు, రైతుల స్పందన, భూ సమస్యల పరిష్కారం వంటి విషయాలపై సర్వే బృందాలను ఆరాతీశారు. కొన్ని వందల ఏళ్లుగా నెలకొన్న భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేలా సిబ్బంది కృషి చేయాలని కోరారు. ప్రతిఒక్కరూ చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, రైతులను న్యాయం చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పాలకొండ: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6వ తేదీన జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎన్.హిమప్రభ, బి.అమరవేణి కోరుతున్నారు. ఇదే విషయమై మండల కేంద్రంలో ధర్నా కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. కనీస వేతనం ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని వారు కోరారు.

రక్తహీనత నివారణకు కృషి చేయండి

- డీఐఓ టి.జగన్‌మోహనరావు



విద్యార్థులకు చేస్తున్న హిమోగ్లోబిన్ పరీక్షలు పరిశీలిస్తున్న డీఐఓ జగన్‌మోహనరావు

కొమరాడ: విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు కృషి చేయాలని డీఐఓ టి.జగన్‌మోహనరావు సూచించారు. మండలంలోని విక్రంపురం, గుణానుపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలను గురువారం సందర్శించిన ఆయన విద్యార్థులకు వైద్య సిబ్బంది చేస్తున్న హిమోగ్లోబిన్ పరీక్షలను పరిశీలించారు. అనంతరం పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువ ఉన్న విద్యార్థులు క్రమం తప్పకుండా ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేసుకోవాలని, పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.వెంకటనాయుడు, ఆర్.ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.